అందని మధ్యాహ్న భోజన బిల్లులు

- నాలుగు నెలలుగా ఎదురు చూపులు
- వంట చేయలేమంటున్న ఏజెన్సీలు
- పట్టించుకోని అధికారులు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బిల్లులు నాలుగు నెలలుగా అందకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024 జనవరి నుంచి జూన్ వరకు బిల్లులు రాక పోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి బిల్లులు అందాల్సి ఉండగా, పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.10వేల నుంచి రూ.50వేలకు పైగా కిరాణం, కూరగాయలు, గుడ్లు, అరటి పండ్లకు ఖర్చులు అవుతున్నాయి. అప్పులు చేసి ప్రతిరోజూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇక మధ్యాహ్న భోజనం చేసేందుకు తమ వల్ల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే తాము ఏజెన్సీల నుంచి తప్పుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అప్పులు చేసి సరుకులు తెచ్చినా బిల్లులు సకాలంలో ప్రభుత్వం నుంచి రాక పోవడంతో సరుకుల యజమానులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో ఇటు మధ్యాహ్న భోజనం వండలేక, అప్పులు తీర్చలేక ప్రతి రోజూ మనోవేదనకు గురికావాల్సి వస్తుందని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. బిల్లులు రాకపోతే వంట చేయడం మానేస్తామని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలుపుతున్నారు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 6,848 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 40 పాఠశాలలకు వంట ఏజెన్సీలు 40 ఉండగా, వాటిలో 112 మంది వంట నిర్వాహకులు పనిచేస్తున్నారు. వారికి ప్రతి నెలా రూ.10లక్షల బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండగా, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సుమారు రూ.40 లక్షలకు పైగా బిల్లులు రావల్సి ఉంది. ప్రభుత్వం విద్యార్థులకు వారానికి మూడు సార్లు గుడ్లు అందించాలని నిబంధన ఉంది. ప్రభుత్వం ఇస్తున్న గుడ్డు ధర రూ.4 కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ.6లకుపైగా పలుకుతుంది. దీంతో అదనంగా రూ.2 చొప్పున భారం పడుతోంది. వారానికి మూడు అరటి పండ్లు అందిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



మల్దకల్‌లో విద్యార్థులకు కోసం వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు



అమరవాయిలో వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

చేసేదేమీ లేక పలు మార్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు విద్యాశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. వంట కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

వడ్డీలు కట్టలేకపోతున్నాం..



ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకపోవడంతో ఇతరులతో వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గుడ్లు అందించాం. గుడ్ల ధరలు పెరగడంతో మరింత భారమైంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– యాదగిరి, అమరవాయి, వంట ఏజెన్సీ నిర్వాహకుడు

గౌరవ వేతనం పెంచాలి..



ప్రభుత్వం వంట ఏజెన్సీలకు చెల్లించే గౌరవ వేతనం పెంచాలి. ప్రతి నెలా రూ.10వేల నుంచి రూ.50వేల వరకు అప్పులు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ఇప్పటికే నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు తమకు గౌరవ వేతనం పెంచాలి.

– గోవర్ధనమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, మల్దకల్

కిరాణం దుకాణాల్లో సరుకులు ఇవ్వడం లేదు..



మధ్యాహ్న భోజనం కోసం కిరాణం దుకాణంలో సరుకులు ఉద్దెర ఇవ్వడం లేదు. ఇప్పటికే నాలుగు నెలలు పెండింగ్ బిల్లులు ఉండటంతో సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇతరుల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించేందుకు బిల్లులు రాకపోవడంతో వారి నుంచి ఒత్తిడి ఎక్కువైంది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.

– సత్యమ్మ, మల్దకల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



నాలుగు నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరులో కొంత ఆలస్యమైంది. వచ్చిన వెంటనే వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లిస్తాం.

– సురేష్, ఇన్‌చార్జి ఎంఈఓ, మల్దకల్

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతాం

గద్వాల రూరల్: తాము బీఆర్‌ఎస్ పార్టీని వీడిపోమని, పార్టీలోనే కొనసాగుతామని గట్టు మాజీ జెడ్పీటీసీ శ్యామల, ఆమె భర్త బాసు హనుమంతు తెలిపారు. ఆదివారం వారు పట్టణంలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తాము బీఆర్‌ఎస్ పార్టీలో 2012లో చేరామని అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీలోనే కొనసాగుతున్నామన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో తాము కూడా పార్టీ మారుతామనే ప్రచారంలో నిజం లేదన్నారు. కేసీఆర్‌పై తమకు పూర్తి విశ్వాసం ఉందని, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీని వీడి వెళ్లవద్దంటూ కేటీఆర్ తమకు ఫోన్‌చేసి కోరినట్లు తెలిపారు. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా స్వీకరించి పార్టీ కోసం పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మోనేష్, తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మించండి



అయిజ: పట్టణంలోని మట్టి గుంత కాలనీలో డ్రెయిజీలు, సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో ఆ కాలనీలో దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీలో అటువైపు వెళ్లేవారు ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు ఉధృతి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మట్టిగుంత కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని కాలనీ ప్రజలు ఎన్నిసార్లు కోరినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేయండి



అయిజ: మండలంలోని బింగిదొడ్డి సమీపంలో బీటీ రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. అయిజ నుంచి గద్వాలకు వెళ్లే రోడ్డుపై మోకాటిలోతు గుంతలు ఏర్పడడంతో వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవించాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

మానవపాడు: మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు రోడ్డు గుండా వెళ్లే రహదారి మధ్యలో కల్వర్టు నిర్మాణం కోతకు గురైంది. వర్షాకాలంలో కల్వర్టు మొత్తం కోతకు గురై ప్రమాదంగా మారింది. ఈ రోడ్డు గుండా రాత్రి సమయంలో ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రధాన రోడ్డుపైనే మురుగు



అయిజ: తేలికపాటి వర్షానికే పట్టణంలోని ప్రధాన రోడ్డుపై మురుగు నిలిచి ప్రయాణానికి ప్రతికూలంగా మారుతోంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్ రోడ్డుపై మురుగు నిలిచింది. మోకాలులోతు గుంతలు ఏర్పడినా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు పక్కన వెళ్లే వారిపై పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



మల్దకల్: గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేట్ వాహనదారులు ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ప్రతి నిత్యం కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి మల్దకల్ మండలంలోని గ్రామాలకు కూలీలతో వస్తున్నారు. ఒక్కొక్క వాహనంలో దాదాపు 20నుంచి 40మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో ప్రైవేట్ వాహనదారులు చెలగాటమాడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి మంగళవారం 'రైతు నేస్తం'

అలంపూర్ రూరల్: ప్రతి మంగళవారం ప్రభుత్వం 'రైతు నేస్తం' కార్యక్రమం చేపడుతుందని ఏఈఓ సాయిరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ మండలంలో బుక్కాపురం గ్రామంలో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

పశువైద్యుడిని నియమించాలి



మల్దకల్: మండలంలోని పాల్వాయిలో ఉన్న పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారిందని రైతులు పేర్కొన్నారు. పశువైద్య కేంద్రానికి డాక్టర్ లేకపోవడంతో పశువులు, గొర్రెలకు వచ్చే వ్యాధులతో మృత్యువాత పడే అవకాశాలున్నాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాల్వాయి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని గ్రామస్తులు, రైతులు కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్ రూరల్: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చంద్రకళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో శానిటేషన్ చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. కలరా, టైఫాయిడ్ రాకుండా జాగ్రత్తలు వహించాలని, గ్రామాల్లో దాటింపు వేయించినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు కాచివడబోసిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

గద్వాల అర్బన్: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టళ్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లను పరిశీలించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కల్పించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హనుమేష్, వీరేష్, సూర్యచంద్ర, తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

అయిజ: గురు పౌర్ణమిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడారు. శ్రీమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నరసింహ, శివ, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ, అనంతమ్మ, సుభద్రమ్మ, దీపిక, నర్సమ్మ పాల్గొన్నారు.

ముళ్లపొదల్లో ట్రాన్స్‌ఫార్మర్



శాంతినగర్: ఆయా కాలనీలకు, వ్యవసాయ మోటార్లకు సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో అడవిని తలపిస్తున్నాయి. దీంతో తరచు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. వడ్డేపల్లి ప్రధాన రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి తీగలు పాకడంతో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించని పరిస్థితి ఏర్పడింది. సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండటం, విద్యుత్‌శాఖ అధికారులు రహదారి గుండా వెళ్తున్నా పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గాలి వీస్తే కరెంట్ పోతుందని, రాత్రి వేళల్లో ఉక్కపోత, దోమల వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు ఈ విషయమై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శుభ్రంగా ఉంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాటం చేయాలి



శాంతినగర్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 10న నిర్వహించనున్న కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో సీఐటీయూ సమావేశంలో కోర్కెల దినోత్సవం కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేయాలని ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ అఖిలభారత కమిటీ పిలుపు మేరకు ఈనెల 10న కోర్కెల దినం నిర్వహిస్తున్నామని, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా వ్యవసాయ పనులు



చెన్నిపాడు శివారులో కాడెద్దులతో విత్తనాలు వేస్తున్న రైతులు



మానవపాడులో బైక్‌పై తీసుకెళ్తున్న సాలుకొట్టె గొర్రు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో కొన్ని రోజుల నుంచి వ్యవసాయ పనులు రైతులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు ప్రారంభించి, విత్తనాలు నాటుతున్నారు. ముందుగా దుక్కిదున్ని, కూలీల కొరత రాకుండా భూమిని చదును చేసి విత్తనాలు నాటుతున్నారు. కాడెద్దులతో గొర్రుకు విత్తనాలు వేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

- టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు
- ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



అలంపూర్ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న టీఎస్‌ఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనే అంతిమ లక్ష్యమని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో చేపట్టిన దీక్షకు నియోజకవర్గ టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయా మండలాల నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి దాన్ని ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచడానికి ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు అవుతున్న సందర్భంగా దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. దీక్షకు మద్దతుగా పెద్ద ఎత్తును తరలి వెళ్తున్నట్లు తెలిపారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసి, కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎలీషా మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం చేపట్టి నేటికి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దండోరా జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మస్తాన్ మాదిగ, సీనియర్ నాయకులు రాజు, శ్రీను, పాండు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని మద్దూరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జయరాజ్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీను, మద్దిలేటి, మధు, సూర్యప్రకాశ్, డేవిడ్, ఈశ్వర్, గోకరి, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని నెట్టెంపాడు, మన్నాపురం, మార్లబీడు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి నీలహళ్లి చరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో చిన్నపాడు అంజనేయులు, శంకర్, పరశురాముడు, కర్రెన్న, గోవిందు, రాములు పాల్గొన్నారు.

గట్టు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వర్గీకరణ కోసం ఉద్యమాన్ని చేపట్టి 30 ఏళ్లు గడిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బండారి డేవిడ్, జిల్లా సీనియర్ నాయకులు మిట్టదొడ్డి ఇమ్మానియేలు, నాయకులు చాగదోణ తిమ్మన్న, పెద్ద సామేలు, సుదర్శన్, దానియేలు, సీమోన్, మధు, రాజు, ప్రవీణ్, యువరాజు పాల్గొన్నారు.



గట్టులో..



ఉండవెల్లిలో..



మద్దూరులో..

మేఘమా.. కురువవే



మేఘమా.. ఓ మేఘమా.. వర్షించిపోవే అన్నట్లు రైతన్నలు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. నల్లటి మేఘాలు అలా కమ్ముకుని వర్షించకుండానే ముందుకు సాగిపోతుండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. తొలకరి వర్షాలకు మెట్ట భూముల్లో పత్తి, వేరుశనగ, కందులు, ఆముదాల సాగు చేశారు. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు వర్షం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. చిన్నపాటి జల్లులు మాత్రమే కురుస్తుండడంతో పెద్ద వర్షం కోసం ఆశగా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ఆదివారం నల్కాపురం, జోకన్‌గట్టు వైపు నల్లటి మేఘాలు కమ్ముకుని వర్షించకుండానే వెళ్లిపోయాయి.

– గట్టు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి గాంధీ చౌక్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు కొత్తగా సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డుపై వాహనదారులకు నియంత్రణ లేకపోవ డంతో అతివేగంగా వాహనాలు నడుపు తున్నారు. దీంతో చాలా సార్లు ప్రమాదాలు సంభవించాయి. అతివేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.